## అందని బంధు..

**అదును దాటుతున్నా ఇంకా రాని పెట్టుబడి సాయం**

# అయోమయంలో అన్నదాతలు

- రంగారెడ్డిజిల్లాలో యాసంగికి ఇవ్వాల్సిన రైతు బంధు డబ్బులు రూ.378.92 కోట్లు
- ఇప్పటివరకు రెండు ఎకరాల లోపు రైతుల ఖాతాల్లో జమ చేసిన డబ్బులు రూ.53.80 కోట్లు
- పంటలు సాగు చేసేందుకు అనేక తంటాలు
- బోరుబావుల్లో తగ్గుముఖం పడుతున్న నీరు
- సాయంత్రం 5గంటలకే బంద్ అవుతున్న కరెంట్ ఇబ్బందులు పడుతున్న రైతులు



షాబాద్ మండలం కుమ్మరిగూడలో వరిసాగుకు సిద్ధం చేసిన కరిగెట్




షాబాద్, జనవరి 21 : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే అన్నదాతలు పెట్టుబడి డబ్బుల కోసం అవస్థలు పడొద్దనే ఉద్దేశంతో ఓ రైతు బిడ్డగా, రైతుల కష్టాలు నేరుగా తెలిసిన వ్యక్తిగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో రైతు బంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ప్రారంభం నాటి నుంచి 2023 యాసంగి, వానకాలం సీజన్ వరకు అదునుకు ముందుగానే రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.5వేల పెట్టుబడి సాయం జమ చేశారు. దీంతో రైతులు పంటలకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి ధైర్యంగా వివిధ రకాల పంటలను సాగు చేసుకునేవారు. ప్రస్తుతం రైతులకు మళ్లీ పెట్టుబడి సాయం మొదలైంది. కానీ యాసంగి సీజన్‌కు పంటలు సాగు చేసుకోవాల్సిన రైతులకు రైతు బంధు డబ్బులు అందకపోవడంతో ఏమి చేయాలో అర్థం కానీ పరిస్థితుల్లో ఉన్నారు. గత నెలన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు మండిపడుతున్నారు. కేసీఆర్ ఇచ్చే రైతు బంధు కాకుండా రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.15వేలు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అది, ఇది ఏదీ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది.

### ఆందోళనలో అన్నదాతలు

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, కల్వకుర్తి(ఆమనగల్లు), మహేశ్వరం, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో ఈ ఏడాది యాసంగి సీజన్‌కు 4.04.436 మంది రైతుల ఖాతాల్లో రూ.378.92కోట్లు నిధులు జమ చేయాల్సి ఉండగా, గత నెలలో ప్రారంభమైన పెట్టుబడి సాయం ఇప్పటివరకు రెండు ఎకరాల లోపు ఉన్న 1.60.139 మంది రైతుల ఖాతాల్లో రూ.53.80కోట్లు మాత్రమే ప్రభుత్వం జమ చేసింది. అదునుకు పంట పెట్టుబడి అందకపోతే పంటలు సాగు చేసుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. దీనికితోడు అడుగంటుతున్న భూగర్భజలాలతోపాటు సాయంత్రం 5 గంటలకు కరెంట్ కూడా కట్ చేస్తుండడంతో పంటల సాగుపై రైతులు ఆలోచనలో పడ్డారు. బోరుబావుల కింద వరినార్లు, కూరగాయల పంటలు సాగు చేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసి ఉంచిన రైతులు పెట్టుబడి సాయం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం అదునుకు ముందుగానే పెట్టుబడి సాయం అందించడంతో ఎవరి వద్ద అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి పంటలు సాగు చేసుకునేవాళ్లమని అన్నదాతలు పేర్కొన్నారు. కొత్తగా ఇచ్చే రైతు భరోసా పథకం దేవుడెరుగు కానీ.. గత ప్రభుత్వం అందించిన రైతు బంధు పథకమైనా అందిస్తే తమ కష్టాలు తప్పుతాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అదునుకు అందని సాయం

రైతుల పంట పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని తీసుకువచ్చింది. దీంతో ఏడాదిలో రెండు విడుతలు ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందజేసింది. పెద్ద, చిన్న తేడా లేకుండా రైతులందరికీ అప్పటి ప్రభుత్వం డబ్బులు అందించింది. గత వానకాలంలో వర్షాలు సరిగ్గా కురువకపోవడంతో బోరుబావుల్లో నీటిమట్టం కూడా గణనీయంగా తగ్గిపోతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నిరంతర కరెంట్ సరఫరా అయ్యేది. ప్రస్తుతం సాయంత్రం 5 అయ్యిందంటే వ్యవసాయానికి కరెంట్ కట్ చేస్తున్నారు. మళ్లీ 5, 6 గంటల తర్వాత అర్ధరాత్రి కరెంట్ ఇస్తున్నారు. రోజుకిస్తున్న 17-18 గంటల కరెంట్‌లో అనేకసార్లు అంతరాయం కలుగుతున్నదని రైతులు చెబుతున్నారు. ఓ వైపు పంట పెట్టుబడి, మరో వైపు అడుగంటుతున్న భూగర్భజలాలు, కరెంట్ కోతలతో యాసంగి సాగు ఎలా చేయాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ముందుగా వరి నార్లు పోసిన ప్రాంతాల్లో నార్లు ముదురుతున్నాయి. పంట పెట్టుబడి సాయం రైతులందరికీ వెంటనే అందించాలని, కరెంట్ కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

### పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నాం



యాసంగి సాగు చేసేందుకు పంట పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్నాను. నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. అందులో రెండు ఎకరాలు వరి పంట సాగు చేసేందుకు వరి నారు పోసి సిద్ధంగా ఉంచాను. రైతు బంధు డబ్బులు వస్తే ఎరువులు కొనడానికి, కూలీలకు ఉపయోగపడుతాయని అనుకుంటే ఇప్పటివరకు నాకు డబ్బులు రాలేదు. కేసీఆర్ హయాంలో రైతులకు అదునుకు పంట పెట్టుబడి డబ్బులు అందించడంతో సంతోషంగా వ్యవసాయం చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు రైతులకు లాగోడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం వెంటనే రైతులందరికీ బ్యాంకు ఖాతాల్లో రైతు బంధు డబ్బులు జమచేయాలి.

**- పి. కృష్ణ, రైతు, కుమ్మరిగూడ(షాబాద్)**

### రైతు బంధు డబ్బులు ఇంకా రాలేదు



పంటల సాగు కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన రైతు బంధు డబ్బులు ఇప్పటికీ రాలేదు. మా నాన్న పేరుపై ఆరు ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వ హయాంలో వానకాలం, యాసంగి పంటలకు ముందుగానే రైతు బంధు డబ్బులు బ్యాంకులో జమయ్యేవి. వాటితో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం వరిపంటతోపాటు, కూరగాయలు, పూలు సాగు చేస్తున్నాను. ప్రభుత్వం రెండు ఎకరాల లోపు ఉన్న రైతులకే ఇప్పటి వరకు పంట సాయం అందించింది. పెట్టుబడి సాయం అదునుకు అందితే తిప్పలు తప్పుతాయి. ఇప్పటివరకు డబ్బులు రాకపోవడంతో అప్పు తెచ్చి ఎరువులు కొని పంటలు సాగు చేయాల్సిందే. ప్రభుత్వం మిగతా రైతులకు కూడా వెంటనే రైతు బంధు డబ్బులు అందించాలి.

**- పి. గోపాల్, రైతు, హైతాబాద్(షాబాద్)**

## 13 చోట్ల కలెక్షన్ పాయింట్లు

**పక్కాగా నిర్మాణ రంగ వ్యర్థాల తరలింపు**

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ ) : భవన నిర్మాణ వ్యర్థాలను తరలింపు ప్రక్రియను మరింత పకడ్బందీగా చేపడుతూ జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకున్నది. నగరం నలువైపులా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లను ఏర్పాటు చేసి.. భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం)లోకి తీసుకొస్తున్నారు. తొలుత జీడిమెట్ల, నాగోల్ ఫతుల్లాగూడలో సీ అండ్ డీ ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. శంషాబాద్, తూంకుంటలో ఇటీవల అదనంగా రెండు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంట్ నుంచి రోజుకు 500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను శుద్ధి చేస్తున్నారు. అయితే అక్రమ డంపింగ్‌లు, వ్యర్థాల తరలింపులో ఇష్టారీతిన కొందరు యజమానులు వ్యవహరిస్తుండడంతో 13 వ్యర్థాల కలెక్షన్ పాయింట్లను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చారు. శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించి 9705433369, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్ పరిధికి 8885737472, 6302074614 నంబర్‌ను సంప్రదించాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. అలాగే ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్, అంబర్‌పేట, యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో వాట్సాప్ 1800 120 1159, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీ పురం, పటాన్‌చెరు, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్‌కు సంబంధించి 9100927073, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, కాప్రా, ముషీరాబాద్, ఖైరతాబాద్, అల్వాల్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్‌కు సంబంధించిన వాట్సాప్ 18002030033, 7330000 203 నంబర్లను సంప్రదించి వ్యర్థాలను జీహెచ్ఎంసీకి అప్పగించాలన్నారు.



వాహనాల తనిఖీలో పాల్గొన్న రాచకొండ క్రైం డీసీపీ అరవిందబాబు తదితరులు

## వాహనాల తనిఖీతో నేరాల అదుపు

- రాచకొండ క్రైం డీసీపీ అరవింద్‌బాబు
- బొంగుళూరు ఔటర్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ
- అనుమానిత వ్యక్తుల విచారణ

ఆదిబట్ల, జనవరి 21 : వాహనాల తనిఖీతో నేరాలు, అక్రమ రవాణాను అదుపు చేయవచ్చని రాచకొండ క్రైం డీసీపీ అరవింద్ బాబు అన్నారు. ఆదివారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగుళూరు 12వ టోల్ ప్లాజా వద్ద మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావుతో కలిసి వాహనాల తనిఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అనుమానితులను వారు విచారించారు. ఈ సందర్భంగా పాత నేరస్తులను గుర్తించడానికి పాతిలాన్ చెకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు బొంగుళూరుతో పాటు 8వ టోల్ ప్లాజా కీసర వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికే పోలీసులు రోడ్లపై వాహనాల తనిఖీ చేపడతారనే ప్రచారం జరగాలన్నారు. ప్రతి వాహనదారుడు అక్రమంగా గంజాయి, డ్రగ్స్‌తో పాటు ఇతర వస్తువులను తరలించాలంటే భయపడాలని తెలిపారు. ఔటర్ రింగు రోడ్డు ప్రాంతం ఎంతో నిర్మానుష్యంగా ఉండటంతో కొంత మంది ఎక్కడో హత్యలు చేసి ఇక్కడ పడవేస్తున్నారన్నారు. వాహనాల తనిఖీతో వాటికి చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఓ వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ఔటర్ రింగు రోడ్డు పక్కనే పడవేశారు. ఇప్పటికీ ఆ మృతదేహం వివరాలు తెలియరాలేదన్నారు. త్వరలోనే మృతదేహం కేసును ఛేదిస్తామని పేర్కొన్నారు. ప్రతి వారంలో ఎప్పుడైనా ఔటర్ రింగురోడ్డుపై వాహనాల తనిఖీ చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు, ఆదిబట్ల ఎస్ఐలు శ్రీనివాస్, రాజు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

- జాతీయస్థాయిలో గుర్తింపు
- నీడిల్ వర్క్‌తో గిరిజన మహిళలకు ఉపాధి

# హస్త కళలకు కేరాఫ్ ఎల్లమ్మతండా

మంచాల, జనవరి 21 : రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఎల్లమ్మతండా గ్రామం చేనేత హస్తకళలకు వేదికగా మారింది. మంచాల మండలంలో ఎక్కువగా గిరిజనులు నివసిస్తుంటారు. ఎవరి ఇంట్లో చూసినా చేతులతో నేసిన వస్తువులనే వాడుతుంటారు. 2000 సంవత్సరంలో ఓ స్వచ్ఛంద సంస్థ గిరిజనులను ప్రోత్సహించేందుకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నది. గిరిజనులు తయారుచేసే వస్త్రాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ వస్త్రాలపై నీడిల్ వర్క్ ద్వారా వివిధ రకాల బొమ్మలు వేయడంలో నిత్యం నిమగ్నమవుతూ.. ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఎల్లమ్మతండా హస్త కళలకు వేదికగా మారింది. గిరిజనులు ఈ పనిలో ఆరితేరారు. వీరిని చూసి ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుంటున్నారు. సాంప్రదాయ దుస్తులపై నీడిల్ వర్క్ చేయడానికి సరైన పెట్టుబడి లేకపోవడంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గిరిజనులను ప్రోత్సహించడడంతోపాటు వారు తయారుచేసిన దుస్తులను మార్కెట్‌లో విక్రయించడానికి కూడా సదుపాయాలను కల్పించడంతో ప్రతి ఒక్కరూ ఈ హస్తకళల వృత్తినే ఎంచుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా తయారు చేసే వస్త్రాలకు మంచి డిమాండ్ ఉండడంతో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎల్లమ్మతండాకు మంచి గుర్తింపు లభించింది. వీరు తయారు చేసిన వస్త్రాలను నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో కూడా ప్రదర్శిస్తున్నారు. వేరే దేశాల్లో కూడా వస్త్ర ప్రదర్శనలు చేస్తున్నారు.



గిరిజన సాంప్రదాయ దుస్తులపై నీడిల్ వర్క్ చేస్తున్న గిరిజనులు




ఎల్లమ్మతండాలో నీడిల్ వర్క్‌పై శిక్షణ పొందేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన స్త్రీశక్తి భవనం

### సర్కారు కృషి మరువలేనిది



మేము తయారుచేసిన వస్త్రాలు గ్రామ స్థాయికే పరిమితం కావడంతో ఎన్నో సంవత్సరాల నుంచి మార్కెట్‌లో సరైన డిమాండ్ ఉండేది కాదు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హస్తకళలకు పెద్దపీట వేసింది. దీంతో వస్త్రాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. అందుకే నేడు ప్రతి ఇంట్లో నీడిల్ వర్క్ ద్వారా వస్త్రాలపై వివిధ రకాల బొమ్మలను వేసి ఉపాధి పొందుతున్నారు.

**- కేతావత్ లక్ష్మి**

### 75 మందికి కుట్టుమిషన్ల పంపిణీ

గతంలో చేనేత జౌళీ శాఖ ఆధ్వర్యంలో ఎల్లమ్మతండా, బోడకొండ, లోయపల్లి గ్రామాలకు చెందిన 100 మంది గిరిజన మహిళలకు 2 నెలలపాటు అల్లికలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌తో పాటు ఐరన్ బాక్స్‌లను ఉచితంగా అందజేశారు. వీరు తయారు చేసిన వస్త్రాలను నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌తో పాటు గోల్కొండ ఖాదీ వస్త్రాలయంలో కూడా విక్రయించేందుకు ప్రత్యేక స్టాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చేనేత జౌలీ శాఖ అధికారులు గిరిజనులకు హామీ ఇచ్చారు. దీంతో వస్త్రాలపై అందమైన బొమ్మలను వేయడంలో పోటీపడుతున్నారు.

### గిరిజన వస్త్రాలకు మంచి డిమాండ్



గిరిజనులు తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. మేము నీడిల్ వర్క్ ప్రారంభించినప్పుడు.. మావద్ద డబ్బులు లేకపోయేది. ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన వస్త్రాలపై నీడిల్ వర్క్‌తో చేసిన వివిధ రకాల డిజైన్‌లను మేము తక్కువ ధరకే విక్రయించేవాళ్లం. గత ప్రభుత్వం హస్తకళలకు పెద్దపీట వేయడంతో మేము తయారు చేసిన వస్త్రాలను నేరుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో అమ్ముకోవడానికి ప్రభుత్వం ప్రోత్సహించింది. నేడు ఎల్లమ్మతండాలో ప్రతిఒక్కరూ నిత్యం వీటిని తయారు చేయడంలో పోటీపడుతున్నారు.

**- సపావట్ పద్మ, సర్పంచ్**



## గగనపు వీధి.. శిఖరపు అంచు నుంచి..

బేగంపేట విమానాశ్రయంలో 'వింగ్స్ ఇండియా-2024 వైమానిక ఎగ్జిబిషన్ అట్టహాసంగా ముగిసింది. నాలుగు రోజులుగా పాటు వైభవంగా సాగిన ఈ ప్రదర్శన చివరి రోజు ఆదివారం భారీగా సందర్శకులు తరలివచ్చారు. విభిన్న విమానాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. లోహ విహంగాల విన్యాసాలను చూసి.. అబ్బురపడ్డారు. బోయింగ్, ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువగా.. వాటి వద్ద చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సెల్ఫీలు తీసుకుంటూ.. మురిసిపోయారు. జోగిపేట్ నుంచి వచ్చిన సుమలత అనే మహిళ తాను హెలికాప్టర్లు గాలిలో చేసిన విన్యాసాలు చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. ఇలా చూడటం ఫస్ట్‌టైం అంటూ.. తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.









### లవ్ మై ఇండీ డాగ్ షో

సిటీబ్యూరో, జనవరి 21 ( నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్ బ్లూక్రాస్ ఆధ్వర్యంలో దోమలగూడలోని చైతన్య విద్యాలయంలో 'లవ్ మై ఇండీ డాగ్ షో' రెండో ఎడిషన్‌ను ఆదివారం ఆ సంస్థ చైర్‌పర్సన్ అమల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీధి కుక్కలను పెంచుకుంటున్న అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జంతు సంక్షేమాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో బ్లూక్రాస్ పనిచేస్తున్నదని అమల అన్నారు. వీధి కుక్కలను గౌరవించడం బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. లవ్ మై ఇండీ డాగ్ షో అనేక జంతు ప్రేమికులను ఒక వేదికపైకి చేర్చుతున్నదన్నారు. కార్యక్రమంలో మార్స్‌పెట్కేర్ ఇండియా సేల్స్ డైరెక్టర్ నితిన్ జైన్, డాక్టర్ శుభం, డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## నిమ్స్‌లో ఎంఎస్‌కు ఆధునిక వైద్యం

**డైరెక్టర్ డాక్టర్ బీరప్ప**

ఖైరతాబాద్, జనవరి 21 : నిమ్స్ దవాఖానలో మల్టిపుల్ స్కెలరోసిస్ (ఎంఎస్)కు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఆదివారం దవాఖానలోని న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో లెక్చర్ హాల్‌లో మల్టిపుల్ స్కెలరోసిస్ అప్‌డేట్ పేరుతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ ఎంఎస్ వ్యాధిబారిన పడిన వారికి మధుమేహ రోగుల మాదిరిగా తిమ్మిర్లు, మంటలు, నీరసం ఉంటుందని తెలిపారు. మెదడుకు సంకేతాలను పంపించే నరాలపై మైలిన్ పొర కప్పి ఉంటుందని, అది దెబ్బతిన్న వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారికి ఆధునిక చికిత్స విధానాలు నిమ్స్ దవాఖానలో అందుబాటులో ఉన్నాయని, వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ సదస్సులో నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అఫ్సాన్ జబీన్, ప్రొఫెసర్ సూర్యప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్ శిరీష, వైద్యులు సుల్తానా షేక్, మహేశ్, కిమ్స్ వైద్యులు మోహన్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ బీరప్ప